# సాక్షి
# సంగారెడ్డి

I

శుక్రవారం । 3 । మే । 2024


## న్యూస్‌రీల్

### దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: ఒడిశా రాష్ట్రంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో మూడేళ్ల డిప్లామా కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా చేనేత జౌళిశాఖ అధికారి విజయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి 9 సీట్లు ఉన్నాయని, పదవ తరగతి ఉత్తీర్ణతతో పాటు 15 నుంచి 23 ఏళ్ల మధ్య వయసు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు జిల్లా కార్యాలయంలో సంప్రదించాలన్నారు. www.handloo mr.nic.in వెబ్‌సైట్ ద్వారా మే 20తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### నేడు జాబ్‌మేళా

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం టాస్క్(తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ చింతల హరికుమార్, కోఆర్డినేటర్ నర్సింలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తయిన వారితో పాటు ఫైనలియర్ చదువుతున్నవారు కూడా అర్హులని చెప్పారు. బయోడేట, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో తీసుకుని ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని కోరారు.

### జహీరాబాద్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న ఉజ్వల్‌రెడ్డి

జహీరాబాద్: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ లోక్‌సభ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు నర్సింహ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ఏషియన్ ఫంక్షన్‌హాల్‌లో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. పదేళ్ల పాలనలో మోదీ చేసిందేమీ లేదని విమర్శించారు. కేవలం మతోన్మాద ఎజెండాను ముందుకు తీసుకెళ్తూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నారన్నారు. ఈసారి ఇండియా కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. జహీరాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ గెలుపు ఖాయమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు జలాలుద్దీన్, నర్సింహులు, ఖాజామైనొద్దీన్, జి.భాస్కర్, శేఖర్, నాగిరెడ్డి, అతార్, అశ్వాక్, సంజీవ్, సంగం, పూజ, గీత,సీమ, భవాని పాల్గొన్నారు.

### క్రషర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

హత్నూర(సంగారెడ్డి): గ్రామ శివారులోని కంకర మిషన్ వల్ల తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నామని హత్నూర గ్రామానికి చెందిన రైతులు, గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. క్రషర్ మిషన్ వల్ల పంటలు పాడై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రషర్ వల్ల మల్లన్న గుట్ట పూర్తిగా ధ్వంసమైందన్నారు. అలాగే హత్నూర, బ్రాహ్మణగూడ, నాగులదేవ్‌పల్లి గ్రామాల్లోని ఇళ్ల గోడలు బీటలు వారుతున్నా క్రషర్ యజమాని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ శబ్దాల కారణంగా హత్నూర అంబేడ్కర్ కళాశాల విద్యార్థులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. దుమ్ము ధూళి కారణంగా వ్యవసాయ భూములు బీడుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీరస్వామి గౌడ్, ఆకుల కిష్టయ్య, పెంటేష్, నాగప్రభు గౌడ్, నరేందర్, దుర్గేశ్వర్ రెడ్డి, యాదగిరి, పెంటేష్, తదితరులు పాల్గొన్నారు.

### హోరాహోరీగా కుస్తీ పోటీలు



కుస్తీ పడుతున్న యువతులు

కంగ్టి(నారాయణఖేడ్): మండల పరిధిలోని తడ్కల్ ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలలో భాగంగా గురువారం కుస్తీపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన మల్లయోధులు పాల్గొన్నారు. కర్ణాటకకు చెందిన యువతులు సైతం కుస్తీ పట్టి అబ్బురపరిచారు. వీటిని తిలకించడానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మెదక్ గడ్డపై ఎగిరేది కాంగ్రెస్ జెండానే



కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రి కొండా సురేఖ, ఎంపీ అభ్యర్థి నీలం తదితరులు

**నీలం మధుకు లక్ష మెజారిటీ పక్కా**

- సిద్దిపేట రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్
- పాల్గొన్న మంత్రి కొండా సురేఖ, కోదండరాం, ఎంపీ అభ్యర్థి నీలంమధు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/సిద్దిపేట కమాన్: మెదక్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగించనుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలంమధు ముదిరాజ్‌కు మద్దతుగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లో సీఎం పాల్గొని మాట్లాడారు. గురువారం సాయంత్రం 5.58 గంటలకు ప్రత్యేక చాపర్ ద్వారా కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో ల్యాండ్ అయ్యారు. కాంగ్రెస్ శ్రేణులు సీఎం రేవంత్‌కు ఘన స్వాగతం పలికాయి. అక్కడి నుంచి 6.25గంటలకు ప్రచార రథంపైకి చేరుకుని సిద్దిపేటలో రోడ్ షో నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ముఖ్యంగా ఎన్‌ఎస్‌యూఐ, పార్టీ శ్రేణులు, భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌కు అవకాశం కల్పించిందన్నారు. బీసీలు ఐకమత్యంతో హస్తం గుర్తుకు ఓటు వేసి లక్ష మెజారిటీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలన్నారు. ఈ మీటింగ్‌లో పాల్గొన్న ఒక్కో కార్యకర్త వంద మంది ఓటర్లతో సమానమన్నారు. ఎన్నికల్లో సత్తా చాటాలని కోరారు.



జిల్లా కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ ర్యాలీలో జనసందోహం

### హరీశ్ గుండెల్లో దడ: మంత్రి

అంతకు ముందు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ సిద్దిపేట అడ్డాగా భావించిన మాజీమంత్రి హరీశ్ ఈరోజు ఈ కార్నర్ మీటింగ్‌కు హాజరయిన ప్రజలను చూసి రాత్రి నిద్ర కూడా పట్టదని, గుండెల్లో దడ మొదలైందని అన్నారు. సిద్దిపేటలో హరీశ్‌రావు బాధితులు వేల సంఖ్యలో ఉన్నారని, వారు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నీలంమధు భారీ మెజారిటీతో పార్లమెంట్‌లో అడుగుపెట్టబోతున్నారన్నారు. ఈ ఎన్నికల్లో బీసీ బిడ్డ నీలంమధు ముదిరాజ్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. లక్ష మెజారిటీ తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

### సీఎంకు ఘన స్వాగతం



సీఎంకు స్వాగతం పలుకుతున్న నాయకులు

కొండపాక(గజ్వేల్): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం గురువారం సిద్దిపేటలో పర్యటించారు. ఈ క్రమంలో కలెక్టరేట్ ప్రాంగణంలోని హెలిప్యాడ్‌కు సాయంత్రం 5.55 నిమిషాలకు చేరుకున్నారు. అప్పటికే అక్కడికి చేరుకున్న మంత్రి కొండా సురేఖ, ఎన్నికల ప్రచార నిర్వహణ ఇన్‌చార్జి మైనంపల్లి హన్మంతరావు, ఎంపీ అభ్యర్థి నీలం మధు, జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, పూజల హరికృష్ణ, మడుపు భూంరెడ్డి, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, అనంతుల నరేందర్, పాల్కంపల్లి నరేందర్‌లు ఘన స్వాగతం పలుకుతూ పుష్పగుచ్ఛాలను అందించారు. అనంతరం కాన్వాయ్‌లో సిద్దిపేటలో జరిగే రోడ్ షోకు బయలు దేరి వెళ్లారు.

### విజయం ఖాయం

టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ సభకు హాజరైన జనాన్ని చూస్తే హస్తం గుర్తుకు ఓటు వేసి, నీలంమధును భారీ మెజారిటీతో గెలిపిస్తారన్నది స్పష్టమవుతోందన్నారు. మోదీ ప్రభుత్వం గ్యాస్ ధర పెంచితే, రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ ధరను సగానికి సగం తగ్గించిందన్నారు. మహిళలకు ఆర్టీసీ ద్వారా ఉచిత ప్రయాణం కల్పించడంతో వారికి ఆత్మగౌరవం పెరిగిందన్నారు. మోదీ ప్రభుత్వంలో అసమానతలు పెరిగాయన్నారు. కాంగ్రెస్ పార్టీతో సమానత్వం వస్తుందన్నారు. ఈ ఎలక్షన్‌లతో కేంద్రంలో మోదీ ప్రభుత్వాన్ని మార్చాలన్నారు. మెదక్ ఎంపీ అభ్యర్థి నీలంమధు ముదిరాజ్ మాట్లాడుతూ గతంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీని గెలిపించిన మెదక్ ప్రజలు, నన్ను ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపించాలన్నారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన నన్ను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఎన్నికల్లో గెలిచిన తరువాత అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మాల జగ్గారెడ్డి, సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్ వచ్చినపుడు ప్రజలకు ఇబ్బంది కలగకుండా అధికారులు చూడాలని ఆదేశించినప్పటికీ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడినట్లు చర్చించుకున్నారు.

## కేంద్రంలో మార్పు కోరుకుంటున్నారు

- కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- మంత్రి దామోదర రాజనర్సింహా



మాట్లాడుతున్న మంత్రి దామోదర

వట్‌పల్లి(అందోల్): మత విద్వేషాలను రెచ్చగొడుతూ దేశంలో అశాంతిని సృష్టించడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని, కేంద్రంలో ప్రభుత్వ మార్పును ప్రజలు కోరుకుంటున్నారని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం వట్‌పల్లిలో యువజన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ ఐదు గ్యారంటీలను అమలు చేసిందన్నారు. ఇళ్ల స్థలాలు, ఇళ్లు, రుణమాఫీ హామీలను త్వరలోనే అమలుచేసి తీరుతామని తెలిపారు. ఇప్పటికే రూ.500 కోట్ల అభివృద్ధి పనులను తీసుకువచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. వైఎస్‌ఆర్ హయాంలో లింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చారని మంత్రి గుర్తుచేశారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. పదవుల్లో యువతకు 50 శాతం అవకాశాలు కల్పిస్తామన్నారు. సురేష్ షెట్కార్ మాట్లాడుతూ.. పదేళ్లు ఎంపీగా ఉన్న బీబీ పాటిల్ తన వ్యాపారాలను కాపాడుకోవడానికే సమయం సరిపోయిందని, నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. సంగారెడ్డి, నాందేడ్ అకోలా జాతీయ రహదారి, పూణె హైవేలు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే తీసుకువచ్చానన్నారు. కార్యక్రమంలో ఐసీసీ ఏబీసీ సెక్రటరీ, ఎంపీ రాజ్‌మోహన్ ఉన్నతల, పీసీసీ మెంబర్ మున్నూరి కిషన్, మాజీ స్కోర్ చైర్మన్ సంగమేశ్వర్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్‌జ్యోషి, శేషారెడ్డి, దిగంబర్, శివరాజ్, జెడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్, పత్రి విఠల్, రాజేందర్‌పాటిల్, రాంరెడ్డి, మల్లేశం, వినయ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, ఖాజా పాల్గొన్నారు.

## 4 నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



పోస్టల్ బాలెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్: జిల్లావ్యాప్తంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేయడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని, ఈ నెల 4 నుంచి 8 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్రాంతి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ కార్యాలయంలో జహీరాబాద్, మెదక్ లోక్‌సభ పరిధిలోని ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ల కేటాయింపును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను నిర్వహించాలన్నారు. ఏడు సెగ్మెంట్లలో ఆయా ఆర్డీఓ కార్యాలయాల్లో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆదివారం కూడా ఈ సెంటర్లు పనిచేస్తాయని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ల ఎత్తివేతకు బీజేపీ కుట్ర

**మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి**



మాట్లాడుతున్న ఆకునూరి మురళి

జహీరాబాద్/న్యాల్‌కల్: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించిన విధంగానే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని మాజీ ఐఏఎస్ అధికారి, జాగో తెలంగాణ కన్వీనర్ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. గురువారం జహీరాబాద్, న్యాల్‌కల్‌లో నిర్వహించిన ఓటర్ల చైతన్య బస్సుయాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదేళ్లుగా అభివృద్ధిని విస్మరించి విద్వేషాలను రెచ్చగొడుతున్న మోదీని ఈ ఎన్నికల్లో గద్దె దింపాలన్నారు. తెలంగాణ నుంచి పన్నుల రూపంలో రూ.12లక్షల కోట్లను వసూలు చేసి, అభివృద్ధి కోసం ఒక్క పైసా ఖర్చు చేయలేదని విమర్శించారు. కార్పొరేట్ల అప్పులను రద్దు చేయడం ద్వారా రూ.16 లక్షల కోట్లను అదాని, అంబానీ లాంటి కంపెనీలకు దోచిపెట్టారన్నారు. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి దాటవేశారన్నారు. జనాభాలో మెజారిటీగా ఉన్న బీసీలకు మంచి జరిగే కుల జనగణన చేపట్టడం లేదని విమర్శించారు. బస్సు యాత్రలో ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, పద్మజాషా, శంకర్, చతపతిరావు, డీక్కీ రాష్ట్ర కార్యదర్శి ఎల్.జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలు మారే వారిని నమ్మొద్దు

- నీలం మధు ఓ అజ్ఞాని
- రాబోయే కాలం బీఆర్‌ఎస్ పార్టీదే..
- వెంకట్రామిరెడ్డిని గెలిపించండి
- హత్నూర మండలం దౌల్తాబాద్ రోడ్‌షోలో హరీశ్



దౌల్తాబాద్ రోడ్ షోలో మాట్లాడుతున్న హరీశ్ రావు, హాజరైన ప్రజలు



హత్నూర(సంగారెడ్డి)/జిన్నారం (పటాన్ చెరువు): రోజుకో పార్టీ మారే వారిని నమ్మి ఓటేయొద్దని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. గురువారం రాత్రి హత్నూర మండలం దౌల్తాబాద్ లో బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డితో కలిసి మాజీ మంత్రి హరీశ్‌రావు రోడ్‌షో నిర్వహించారు. అనంతరం మండల కేంద్రమైన గుమ్మడిదల, జిన్నారం మండలం బొల్లారం మునిసిపాలిటీలోనూ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు కనీస పరిజ్ఞానం లేదన్నారు. ఏ పార్టీలో ఉంటాడో ఆయనకే తెలియదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క మైనార్టీకి అయినా మంత్రి పదవి ఇచ్చిందా అని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో మైనార్టీకి చెందిన వ్యక్తికి ఉపముఖ్యమంత్రి ఇచ్చిన విషయం గుర్తు చేశారు. రాబోయే కాలం బీఆర్‌ఎస్ పార్టీదే అన్నారు. కార్యకర్తలు ధైర్యంగా ముందుకు సాగుతూ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకటరామిరెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా ఎమ్మెల్యే సునీతారెడ్డి తోపాటు తాను గంటసేపట్లో మీ ముందుంటానని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను స్క్రీన్‌పై చూపిస్తూ.. ఏ ఒక్క హామీ అయినా అమలైందా అని ప్రజలను హరీశ్‌రావు అడిగారు.

**మదన్ రెడ్డి కాంగ్రెస్‌లో ఎందుకు చేరాడు?**

మట్టి మాఫియా.. ఇసుక మాఫియా.. బియ్యం మాఫియా.. చేసిన వారిని కాపాడుకోవడానికే మదన్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరాడని హరీశ్ ఆరోపించారు. కేసీఆర్‌కు సన్నిహితుడినని చెప్పుకునే మదన్‌రెడ్డి.. బీఆర్‌ఎస్ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి.. కష్టకాలంలో పార్టీకి అండగా ఉండకుండా కాంగ్రెస్‌లో చేరాడని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. కేసీఆర్ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని ఆమె తెలిపారు. కాంగ్రెస్ అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి గద్దె ఎక్కిందన్నారు. ఎంపీగా గెలిపిస్తే ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానని బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి హామీ ఇచ్చారు. అందుకే రాజకీయాలకు వచ్చానని, నిండు మనసుతో ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, ఎంపీపీ నర్సింలు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, సింగయిపల్లి గోపి, నరసింహారెడ్డి, శివ శంకర్‌రావు, రామచంద్రారెడ్డి, రవికుమార్, కిషోర్ పాల్గొన్నారు.

### ముగిసిన ఉత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని వీరభద్రేశ్వర ఆలయ జాతర ముగిసింది. చివరి రోజైన గురువారం భద్రకాళీ మాత, వీరభద్రేశ్వరులకు అభిషేకం నిర్వహించి నైవేద్యాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రథోత్సవం స్థానిక బసవేశ్వర ఆలయం నుంచి వీరభద్రేశ్వర ఆలయం వరకు సాగింది. ఆలయ ప్రాంగణంలో పెద్దరాజు పెద్దమ్మ మూడవ భాగం నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సంగారెడ్డి: పట్టణంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ 2 ఏఈ సంతోష్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 9 గంటల వరకు పట్టణ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులు చేపట్టనున్న దృష్ట్యా గంట పాటు కరెంట్ నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఆనంద్ ఆర్ట్స్ కలెక్టరేట్ నుంచి ఎస్ఎస్ రెడ్డి స్వీట్ హౌస్ వరకు, అలాగే బైపాస్‌లో ఐబీ నుంచి ఎస్బీఐ బ్యాంకు వరకు విద్యుత్ ఉండదని తెలిపారు.

## లోక్‌సభ యుద్ధంలోనూ గెలుద్దాం



ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను సన్మానిస్తున్న కార్యకర్తలు

నారాయణఖేడ్: అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడంతో పోరాటం ఆగిపోలేదని, లోక్‌సభ యుద్ధంలోనూ గెలుపొందాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు నిర్మలారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్, ఖేడ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శశికళ పిలుపునిచ్చారు. నాగల్‌గిద్దలో గురువారం నిర్వహించిన మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీల్లో ఐదింటిని అమలు చేసినట్లు గుర్తుచేశారు. ఖేడ్ నియోజకవర్గానికి నాలుగు నెలల్లోపే రూ.50కోట్ల విలువైన అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, భవనాలు, అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మరింత అభివృద్ధి కోసం సురేష్ షెట్కార్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పండరినాథ్, మాణిక్‌రావు పాటిల్, శ్రీకాంత్ రెడ్డి, నారాయణజాదవ్, రహీం పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### బదిలీలు, పదోన్నతులపై షెడ్యూల్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న సదానంద గౌడ్

**మెదక్‌జోన్ :** ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సదానంద గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆ యూనియన్ నాయకులు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునఃరుద్ధరించాలన్నారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ.. లీవ్ రూల్స్ సీసీఏ రూల్స్ విధి విధానాలపై అవగాహన కల్పించారు. సీనియర్ నాయకుడు పున్న గణేశ్ పెన్షన్ రూల్స్ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సాబేర్ అలీ, ప్రధాన కార్యదర్శి పోచయ్య, రాష్ట్ర బాధ్యులు ఎర్రరాజు, జిల్లా బాధ్యులు భూపతి గౌడ్, అశోక్, కిష్టయ్య, అరుణ్ కుమార్, శివప్రసాద్, సత్యనారాయణ, పాండు, తదితరులు పాల్గొన్నారు.

### దీపక్ కుమార్‌కు ప్రతిభా పురస్కారం



అవార్డు అందుకుంటున్న దీపక్ కుమార్

**నారాయణఖేడ్:** నారాయణఖేడ్ పట్టణానికి చెందిన నిజామాబాద్ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్ 33వ తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కె.దీపక్ కుమార్ విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభకు గాను డీజీఎన్‌సీసీ అన్‌స్పాట్ అవార్డుకు ఎంపికయ్యారు. ఇందులో భాగంగా ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు సంబంధించిన సికింద్రాబాద్ కార్యాలయంలో లెఫ్టినెంట్ ఆఫ్ జనరల్ గురుబీర్ పాల్‌సింగ్ చేతుల మీదుగా గురువారం అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా దీపక్ కుమార్‌ను నిజామాబాద్ గ్రూప్ కమాండర్ కల్నల్ సునీల్ అబ్రహం, 33వ బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ పీఎస్.నంద, సహాయ లెఫ్టినెంట్ కల్నల్ పీఎం.రావు తదితరులు అభినందించారు.

### గుండెపోటుతో మృతి

**శివ్వంపేట(నర్సాపూర్) :** మండల పరిధి కొంతన్‌పల్లి గ్రామానికి చెందిన టీపీసీసీ మత్స్యశాఖ కమిటీ కార్యదర్శి పెద్దపల్లి రాములు(40) గుండెపోటుతో మృతిచెందాడు. బుధవారం అర్ధరాత్రి ఇంట్లో పడుకొని ఉండగా గుండెపోటుకు గురై చినపోయారు. డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, తదితర కాంగ్రెస్ నాయకులతో పాటు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నాగేశ్వర్‌రావు, జగన్‌రెడ్డి రాములు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.



## కాంగ్రెస్ జోష్



ర్యాలీగా వస్తున్న కార్యకర్తలు



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి





హస్తం ఫ్లకార్డుతో వృద్ధురాలు



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ



మాట్లాడుతున్న కోదండరాం



బందోబస్తులో పాల్గొన్న పోలీసులు



స్కేటింగ్ చేస్తూ కాంగ్రెస్ జెండాతో..

# హుస్నాబాద్ ఎటువైపో!



హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రం

- అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఒకే పార్టీకి మద్దతు ఇస్తున్న ప్రజలు
- ఇక్కడ ముందంజలో ఉన్నవారే ఎంపీలు
- మెజార్టీ ఓట్ల కోసం ప్రధాన పార్టీల ప్రణాళిక
- జోరుగా ప్రచారం

**హుస్నాబాద్:** ఉద్యమాలకు పెట్టిన పేరు.. కమ్యూనిస్టుల కంచుకోటగా పేరు గాంచిన ఇందుర్తి నియోజకవర్గం రూపాంతరం చెంది హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంగా ఆవిర్భవించింది. ఈ ప్రాంతం ఇందుర్తి నియోజకవర్గంగా ఉన్న సమయంలో ఇక్కడి నుంచి ఆరు సార్లు కమ్యూనిస్టు అభ్యర్థులే విజయం సాధించారు. తదనంతరం జరిగిన పరిణామాల వల్ల హుస్నాబాద్ నియోజకవర్గంగా మారగా, ఇక్కడి రాజకీయ పార్టీల ప్రాబల్యంలో మార్పులు చోటు చేసుకుంటూ వస్తున్నాయి. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షతో ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్ర సమితి ఈ స్థానంలో అనూహ్యంగా ముందుకు వచ్చింది. రెండు పర్యాయాలు ఇక్కడ నుంచి బీఆర్‌ఎస్ విజయం సాధించింది.

### ప్రధాన పార్టీలు దృష్టి..

2009లో జరిగిన ఎన్నికలతోపాటు 15 ఏళ్ల అనంతరం ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఇక్కడి నుంచి గెలుపొందారు. ప్రతీసారి అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు జరుగుతున్న ఎన్నికల్లో ఈ సెగ్మెంట్‌లో మెజార్టీ సాధించిన పార్టీలకు చెందిన వారే ఎంపీగా గెలుస్తున్నారు.

> ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ ఈ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ సాధించాలని దృష్టి సారించాయి. స్థానికంగా ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ఎన్నికలను ఛాలెంజ్‌గా తీసుకున్నారు. అత్యధిక మెజార్టీ సాధించి తిరిగి కరీంనగర్ ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ ఖాతాలో వేసేందుకు సమాయత్తమవుతున్నారు. అదే విధంగా అత్యధిక ఓట్లు సాధించేలా బీజేపీ శ్రేణులు సర్వ శక్తులు ఒడ్డుతున్నాయి. ప్రస్తుత ఎన్నికల్లో ఏ విధమైన తీర్పు ఇవ్వనున్నారో, పార్లమెంట్‌లో ఎవరు అడుగు పెట్టనున్నారో అన్నది భవిష్యత్‌లో తేలనుంది.

### 2019లో భిన్నమైన తీర్పు

2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం అందుకు భిన్నంగా తీర్పు వెలువడింది. ఇక్కడ మూడవ స్థానం సాధించిన బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ ఎంపీగా గెలుపొంది చరిత్రను తిరగరాశారు. అప్పుడు బీఆర్‌ఎస్ ముందంజలో ఉండగా, కాంగ్రెస్ రెండో స్థానం, బీజేపీ మూడో స్థానానికి పరిమితమైంది. అయినప్పటికీ బండి సంజయ్ మిగితా నాలుగు నియోజకవర్గాల్లో వచ్చిన మెజార్టీతో 88 వేల పై చిలుకు ఓట్లతో విజయం సాధించారు. ప్రస్తుతం ఈ నియోజకవర్గానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని ఏ విధంగా ముందుకు తీసుకెళ్తారనేది చర్చానీయాంశంగా మారింది.ఈ స్థానం నుంచి ఒక పర్యాయం ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించి పార్లమెంట్ టికెట్ ఆశించి భంగపడ్డ అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డితో ఒకింత అసహనానికి గురవుతున్న మిత్రపక్షమైన కమ్యూనిస్టులను కలుపుకొని ముందుకు సాగి ఈ స్థానంలో మెజార్టీ సాధిస్తారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### మెజార్టీ ఓట్లు సాధించినవారే..

2009 పార్లమెంట్ ఎన్నికలు మినహాయిస్తే ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్‌కే ఇక్కడి నుంచి అధిక ఓట్లు నమోదయ్యాయి. 2014లో ఎంపీ కూడా అయ్యారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో వినోద్ కుమార్‌కు హుస్నాబాద్ స్థానంలో 22 వేల 762 ఓట్ల మెజార్టీ లభించింది. కాంగ్రెస్, బీజేపీలు రెండు, మూడవ స్థానాల్లో ఉన్నాయి. అయినప్పటికీ కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ గెలిచారు. 2018లో అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి సతీష్ కుమార్ 70 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అనంతరం 2019 పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 66,855 ఓట్లు, కాంగ్రెస్‌కు 44,123, బీజేపీకి 43,144 ఓట్లనిస్తూ ఈ ప్రాంత ఓటర్లు విభిన్న తీర్పునిచ్చారు. ఈ ఒక్క ఎన్నికను మినహాయిస్తే గతంలో జరిగిన అన్ని ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో మెజార్టీ ఓట్లు సాధించిన వారే ఎంపీగా ఎన్నికయ్యారు.



దుబ్బాక : అవార్డు అందుకున్న విద్యార్థులు



పటాన్‌చెరు టౌన్: ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

## రాష్ట్ర స్థాయిలో అవార్డులు

**దుబ్బాక :** జిజ్ఞాస రాష్ట్ర స్థాయి పోటీల్లో దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు తృతీయ బహుమతితోపాటు ప్రశంసాపత్రం, నగదును అందుకున్నారు. గురువారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో అర్థశాస్త్రం విభాగంలో ఆర్థిక వికాసం–పరపతి సహకార సంఘాలు, సిద్దిపేట జిల్లా ఆటో క్రెడిట్ కో ఆపరేట్ సొసైటీ ఒక ప్రత్యేక అధ్యయనం అనే ప్రాజెక్ట్‌ను అధ్యాపకురాలు పొన్నాల సునీత పర్యవేక్షణలో కళాశాల బీఏ విద్యార్థినులు స్రవంతి, శిరీష, దివ్య , జైనీషా, రమ్య రూపొందించారు. ఈ ప్రాజెక్టుకు గాను రాష్ట్రస్థాయిలో అవార్డు లభించింది. ఇందుకు కళాశాల ప్రిన్సిపాల్ భవానీ, వైస్ ప్రిన్సిపాల్ రమేశ్, అధ్యాపకులు ప్రత్యేక అభినందన సభ ఏర్పాటు చేసి విద్యార్థులతోపాటు అధ్యాపకురాలు సునీతను సన్మానించారు.

**పటాన్‌చెరు టౌన్:** పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు రాష్ట్ర స్థాయి జిజ్ఞాస స్టడీ ప్రాజెక్టు ఆంగ్ల విభాగంలో ప్రథమ బహుమతి వరించింది. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ బుర్ర వెంకటేశం చేతుల మీదుగా గురువారం రూ.30 వేల నగదు ప్రోత్సాహక బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ఆంగ్ల అధ్యాపకులు డీఎస్ఎస్ఆర్ క్రిష్ణ పర్యవేక్షణలో 'గ్లోసోఫోబియా 2.0' అనే అంశం పై హీన, కిశోరి, మేఘన, నేహ, సానియా ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు తెలిపారు.

## బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి

ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్:** బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అన్నారు. గురువారం జహీరాబాద్ మండలంలోని అల్గోల్, బూచనెల్లి, తూంకుంట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలను ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక వాటి గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. దశాబ్ద కాలంగా బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కేంద్రం ఇచ్చింది గాడిద గుడ్డు అని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారని, మరి నీవు వంద రోజుల్లో హామీలను అమలు చేస్తానని చెప్పి గాడిద గుడ్డు ఇచ్చావు అని ఎద్దేవా చేశారు. పదేళ్ల నుంచి కేంద్రం రాష్ట్రానికి మొండిచేయి చూపిందని తాము చెబుతూ వస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రజలు బీఆర్‌ఎస్ అందించిన పాలనను గుర్తించి పార్టీ తరఫున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాలి అనిల్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌యూసీసీ సభ్యుడు షేక్ ఫరీద్, బీఆర్‌ఎస్ నాయకులు తట్టు నారాయణ, మచ్చేందర్, పెంటారెడ్డి, మోహన్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, వహీద్, చంద్రకాంత్ రెడ్డి, ప్రభాకర్, రాజు, బస్వరాజ్, అమిత్‌కుమార్, శ్రీనివాస్, గౌసొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## ఓటుతో బుద్ధి చెప్పాలి

గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్



ప్రచారం చేస్తున్న నాయకులు

**గజ్వేల్‌రూరల్:** మాయమాటలతో మభ్యపెట్టేందుకు వస్తున్నవారికి ఓటుతో బుద్ధి చెప్పాలని గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిధిలోని బంగ్లా వెంకటాపూర్‌లో బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డికి మద్దతుగా గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేసీఆర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను తప్పించుకోవాలని చూస్తుందని, బీజేపీ మతాల మధ్య చిచ్చుపెడుతూ విద్వేషపూరిత రాజకీయం చేస్తుందని విమర్శించారు. అబద్ధాలతో ఓట్లడిగేందుకు వస్తున్న కాంగ్రెస్, బీజేపీలకు ఎంపీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లేశం, నాయకులు మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, బొల్లారం ఎల్లయ్య, గొడుగు స్వామి, రమేశ్ గౌడ్, నర్సింలు, సత్తిరెడ్డి, భాస్కర్, బాపురెడ్డి, బురాన్, బాలమణి, కొమురయ్య, కుమార్, రవీందర్‌గౌడ్, సాజిద్, శివకుమార్, మోహన్‌బాబు, మనోహర్ పాల్గొన్నారు.

## ఓట్ల కోసమే దేవుళ్ల మీద ప్రమాణాలు

భువనగిరి సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్



ప్రచారంలో జహంగీర్, నాయకులు

**కొమురవెల్లి(సిద్దిపేట):** ఓట్ల కోసమే దేవుళ్ల మీద కొంత మంది నాయకులు ప్రమాణాలు చేస్తున్నారని భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ అన్నారు. గురువారం మండలంలోని అయినాపూర్, మర్రిముచ్చాల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ఎంపీలుగా గెలిచిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బూర నర్సయ్య గౌడ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఏం చేశారని, మళ్లీ గెలిపిస్తే ఏం చేస్తారని ప్రశ్నించారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. పేదల కోసం కమ్యూనిస్టులు తమ జీవితాలను త్యాగం చేస్తారని, పేదల కోసం పని చేసే ఏకైక పార్టీ సీపీఎం పార్టీ అన్నారు. సీపీఎం పార్టీని గెలిపిస్తే చేర్యాల రెవిన్యూ డివిజన్, దాసారం గుట్ట ఆలయానికి అప్పగించేత వరకు సీపీఎం పోరాటం చేస్తుందని తెలిపారు. ప్రచారంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అడివయ్య, జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు నక్క యాదవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోదాంలో అగ్ని ప్రమాదం

**పటాన్ చెరు టౌన్:** స్క్రాప్ గోదాంలో అగ్ని ప్రమాదం జరిగి మంటలు వ్యాపించిన ఘటన పటాన్‌చెరు డివిజన్ పరిధిలో చోటు చేసుకుంది. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జన్యా నాయక్ తెలిపిన వివరాలు ప్రకారం.. పటాన్‌చెరు శివారు నక్క వాగు సమీపంలో ఏర్పాటు చేసిన పూజ ఎంటర్‌ప్రైజెస్ తుక్కు గోదాంలో గురువారం సాయంత్రం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అందులో ప్లాస్టిక్ వస్తువులు ఉండటంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి పెద్ద ఎత్తున అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్ని ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## ప్రత్యేక భేటీ



దామోదరతో మెదక్ జిల్లా ప్రత్యేక పరిశీలకుడు

**సంగారెడ్డి :** కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంత్రి దామోదర రాజనర్సింహను కేరళ రాష్ట్ర కేసర్ గౌడ్ లోక్‌సభ నియోజకవర్గ మాజీ ఎంపీ, ప్రస్తుత అభ్యర్థి, ఏఐసీసీ మెదక్ జిల్లా ప్రత్యేక పరిశీలకులు రాజ్ మోహన్ గురువారం రాత్రి కలిశారు. పట్టణంలోని మంత్రి నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జహీరాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ గెలుపునకు అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. లోక్ సభ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ప్రచారంపై వారు మాట్లాడుకున్నారు.

## కార్మికుడు ఆత్మహత్య

**శివ్వంపేట(నర్సాపూర్) :** కుటుంబ కలహాలతో వలస కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధి రూప్ల తండాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన గోవర్ధన్ రావు (24) రూప్ల తండా వద్ద ఇటుక బట్టీలో పని చేసేందుకు 6 నెలల కిందట కుటుంబంతో కలిసి వచ్చారు. బుధవారం ఇంట్లో జరగడంతో బయటకు వెళ్లి పురుగుల మందు సేవించి ఇంటికి వచ్చాడు. వాంతులు చేసుకుంటుండటంతో గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుతాస్పత్రికి తరలించగా గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి తండ్రి రామారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

## వాగులో పడి వృద్ధురాలు..

**తొగుట(దుబ్బాక):** మతి స్థిమితం కోల్పోయిన వృద్ధురాలు కూడవెల్లి వాగు చెక్‌డ్యామ్‌లో పడి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. తొగుట ఏఎస్ఐ రాంరెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన కాసర్ల మైసవ్వ (63) కొంత కాలంగా మతి స్థిమితం కోల్పోయి తిరుగుతోంది. కుమారుడు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించినా నయంకాలేదు. మంగళవారం ఉదయం ఆమె చిన్న కొడుకు కనకయ్య తొగుట పీహెచ్‌సీలో వైద్యుడికి చూపించి ఇంటికి పంపించి పనికి వెళ్లాడు. రాత్రి వరకు ఆమె ఇంటికి రాకపోవడంతో పలు చోట్ల వెతికినా ఆచూ కీ లభించలేదు. బుధవారం ఉదయం రాంపురం చెక్‌డ్యామ్‌లో చేపలు పడుతున్న వారికి మహిళ మృతదేహ ం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించగా మృతదేహన్ని బయటకు తీయించి పరిశీలించి తొగుకు చెందిన మహిళగా గుర్తించారు. మృతురాలి కుమారుడు కనకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఏఎస్ఐ రాంరెడ్డి తెలిపారు.

## భవనంపై నుంచి పడి..



ఎల్లయ్య (ఫైల్)

**నంగునూరు(సిద్దిపేట):** భవనంపై నుంచి పడి కార్మికుడు మృతి చెందిన ఘటన గురువారం నంగునూరులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గరిపల్లి ఎల్లయ్య(57) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. అదే గ్రామంలో రెండంతస్తుల భవనంపై సెంట్రింగ్ పని చేస్తున్నాడు. ఈ క్రమంలో జారి కిందపడగా తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య కమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రాజగోపాలపేట ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**సిద్దిపేటరూరల్:** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన రూరల్ మండల పరిధిలోని పుల్లూరు బండ శివారులో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. టాటా ఏస్ వాహనం పుల్లూరు మీదుగా మల్యాల గ్రామానికి వెళ్తుంది. ఇదే సమయంలో రూరల్ మండలం బండచెర్లపల్లి గ్రామానికి చెందిన నాగరాజు బైక్ పై మల్యాల నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. సరిగ్గా పుల్లూరు బండ వద్దకు రాగానే ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో బైక్ పై వెళ్తున్న నాగరాజు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.